రోడ్లపై నీరు.. వెళ్లే దారేది?

- కొద్దిపాటి వర్షాలకే సింగ్‌నగర్ పరిసరాల్లో నీట మునుగుతున్న రహదారులు
- వర్షం నీరు కదిలే మార్గం లేకపోవడంతో తరచూ అవస్థలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 58వ డివిజన్ పరిధిలోని సింగ్‌నగర్, నందమూరి నగర్ పరిసర ప్రాంతాల్లో రహదారులు సరిగా లేక పోవడం.. రోడ్లు ఉన్న ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో కొద్దిపాటి వర్షాలు పడినా ఆ నీరంతా రహదారులపై నిలిచిపోతోంది. దీంతో ప్రయాణికులు, స్థానికులు అవస్థ పడుతున్నారు.



తోటవారి వీధి పదో లైన్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

డ్రెయిన్ల నిర్మాణాలపై దృష్టి సారించాలి

నందమూరినగర్ పరిధిలోకి వచ్చే సన్‌సిటీ కాలనీ, షణ్ముఖసాయి నగర్, భారతమాత కాలనీ, తోటవారి వీధి, సిద్ధార్థనగర్, వినాయక్‌కాలనీ పరిసర ప్రాంతాల్లోని చాలా రోడ్లలో డ్రెయినేజీ వ్యవస్థ లేదు. కేవలం రాకపోకలు సాగించేందుకు కొన్నిచోట్ల తారు రోడ్లు ఉంటే మరికొన్ని చోట్ల మట్టిరోడ్ల పైనే ప్రజలు రాకపోకలు చేస్తుంటారు. అయితే కొద్దిపాటి వర్షాలు పడినా ఈ రోడ్లపై వర్షం నీరు కదిలే మార్గం లేకపోవడం.. నివాసాల పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో నీరు కూడా రోడ్లపైకి వచ్చేయడంతో ఇక్కడి రహదారులు జలమయమవుతున్నాయి. ఎక్కడైనా వర్షం నీరు రోడ్లపై, ఇళ్లల్లో నిలిచిపోతే మోటార్ల సాయంతో వాటిని తొలగించి అధికారులు తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నారేగానీ శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టడంతో పాటు పాడైపోయిన కాల్వలు బాగుచేయించాల్సి ఉంది. నందమూరినగర్‌లో చిన్న డ్రెయిన్ల స్థానంలో పెద్దవి నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



భరతమాతకాలనీ ఆరో రోడ్డులో వాన నీటితో ముంపు



అధ్వానంగా న్యూఆర్‌ఆర్‌పేట వంతెన ముందు ప్రధాన రహదారి

పూడికలు తీయకుండా వదిలేస్తున్నారు

సింగ్‌నగర్, నందమూరినగర్ పరిసర ప్రాంతాల్లోని డ్రెయిన్లలో పూడికలు సరిగా తీయకపోవడంతో వర్షం నీరు, మురుగు పారే మార్గం లేక ఆ నీరంతా రోడ్లపైకి చేరుతోంది. ప్రధానంగా గతేడాది బుడమేరు వరదల సమయంలో కాలువల్లో పెద్ద ఎత్తున చెత్తా, చెదారం వచ్చి చేరాయి. సంబంధిత శానిటరీ అధికారులు కొన్ని దారుల్లో పూడికలు తీయించి మరికొన్ని వీధుల్లో అసలు కాలువలనే పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో నివాసిత ప్రాంతాలు, ప్రధాన రహదారులు సైతం చిన్నపాటి వర్షాలకే మునిగిపోతున్నాయి. సంబంధిత కార్పొరేషన్ ఉన్నతాధికారులు గ్యాంగ్ వర్క్‌లను ఏర్పాటుచేసి సమస్యాత్మక ప్రాంతాల్లోని కాలువల్లో పూడికలు తీయించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రధాన రహదారులు మరమ్మతులు చేయించాలి



సింగ్‌నగర్ నుంచి న్యూఆర్‌ఆర్‌పేటకు వెళ్లే వంతెన ముందు రోడ్డు గత వరదల్లో బాగా పాడైపోయింది. అప్పటి నుంచి కొద్దిపాటి వర్షం పడినా రోడ్డంతా మునిగిపోతుంది. రాకపోకలు సాగించేందుకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. దీనికి మరమ్మతులు చేయించి, ముంపు సమస్యలను పరిష్కరించాలి.

–ఎండీ ఖాజా, ఇందిరానాయక్‌నగర్

ఖాళీ స్థలాల్లో నీళ్లన్నీ రోడ్లపైకి వచ్చేస్తున్నాయి

తోట వారి వీధిలో ఉన్న 16 లైన్లలో సైడ్ డ్రెయిన్లు సరిగా లేవు. ముఖ్యంగా ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో వర్షం నీరు నెలల తరబడి ఉండిపోతోంది. కొద్దిపాటి వర్షాలు పడినా ఆ నీరంతా రోడ్లపైకి రావడంతో పాటు పాములు, తేళ్ల వంటి విషపురుగులు కూడా ఇళ్లలోకి వచ్చేస్తున్నాయి. చిన్నపిల్లలు, మహిళలు ఇళ్లల్లో ఉండటానికి కూడా భయపడుతున్నారు. ఖాళీ స్థలాలను శుభ్రం చేయించి ముంపు సమస్యలను తొలగించాలి.

– వాసు, తోటవారివీధి

క్లుప్తంగా

భగవద్గీతను నిత్యం పారాయణం చేయాలి



విజయవాడ కల్చరల్: భగవద్గీతను నిత్యం పారాయణం చేయాలని డాక్టర్ మేడూరి సూర్య నారాయణ శర్మ అన్నారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థమహాస్వామి 75వ జన్మదిన వేడుకల సందర్భంగా దుర్గాపురం శివరామకృష్ణ క్షేత్రంలోని భారతీ తీర్థ శ్రవణ సదనంలో ఆదిశంకరులు భాష్యం చెప్పిన సంపూర్ణ భగవద్గీతలోని సాంఖ్యయోగం, కర్మయోగం అంశంగా ప్రసంగం చేశారు. భగవద్గీతలోని మూడవ అధ్యాయం కర్మయోగం, భారత కథ ఇందులో కనిపిస్తుంది. భగవద్గీతలో వేద వేదాంత విషయాలున్నాయన్నారు. భగవంతుని తత్వం, ఆత్మతత్వం, జీవన గమ్యం ప్రధానగా ఉంటాయన్నారు. కురుపాండవ సంగ్రామంలో యుద్ధ భూమిలో విరాగైన అర్జునుడికి భగవాన్ శ్రీకృష్ణుడు కర్తవ్య బోధ చేశాడన్నారు.

పింఛన్ల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 29వ డివిజన్ మధురానగర్, 30వ డివిజన్ రామకృష్ణాపురంలో సోమవారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గొట్టుముక్కల రఘురామరాజు, ఘంటా కృష్ణమోహన్, అడపా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కుందావారి కండ్రిక సచివాలయంలో కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ సోమవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం బర్మాకాలనీ, రాధానగర్, ప్రజాశక్తినగర్, కండ్రిక కాలనీలలో సచివాలయ సెక్రటరీలతో కలిసి ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. 62వ డివిజన్లో కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని బాలగణపతి మందిరంలో స్వామి వారు శ్రీ విద్యాగణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాతబస్తీ పూజారి వారి వీధిలోని శ్రీ బాల గణపతి ఆలయంలో కొలువై ఉన్న స్వామి వారి 40వ వార్షిక ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం విద్యాగణపతిగా అలంకరించారు. ఉదయం స్వామి వారి సన్నిధిలో సుప్రభాత సేవతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం సహస్ర నామార్చన తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారికి సహస్ర మోదక (ఉండ్రాళ్లు) పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. స్వామి వారి సన్నిధిలో వివిధ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలను, ఇతర స్టేషనరీ సామగ్రిని నిర్వాహకులు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో శివలింగ దీపోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ ట్రెండ్‌సెట్ మెడోస్‌లో వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన శివలింగ దీపోత్సవం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని శివలింగం ఆకారంలో దీపాలను వెలిగించి పూలతో అర్చనలు చేశారు. తొలుత వినాయకుడికి ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమాలను సంఘ కార్యదర్శి యర్రంశెట్టి మురళి, సభ్యులు పర్యవేక్షించారు.

నున్నలో విజిలెన్స్ తనిఖీలు



నున్న(విజయవాడరూరల్): నున్నలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన పీఏసీఎస్ సొసైటీ ద్వారా విక్రయిస్తున్న ఎరువులను విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఉదయం నుంచి సొసైటీ గోడౌన్ వద్ద ఎరువుల కోసం పడిగాపులు పడినా ఎరువులు విక్రయించక పోవడంతో రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సాయంత్రం విజిలెన్స్ డీఎస్పీ యు.బంగార్రాజు, ఏఓ కిరణ్ ఆకస్మికంగా వచ్చి గోదాములోని ఎరువులను తనిఖీ చేశారు. విజిలెన్స్ అధికారులు స్టాకును పరిశీలించిన పిమ్మట ఎరువులను ఏ విధంగా విక్రయిస్తున్నారనే వివరాలను సొసైటీ సీఈఓ తాడంకి రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. సొసైటీకి 15 టన్నుల యూరియా వచ్చిందని ఎకరానికి అరబస్తా చొప్పున రైతుల పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డును బట్టి విక్రయిస్తున్నట్లు తెలియజేశారు. యూరియాతో పాటు 20:20:0:15, డీఏపీ, 14:35, పొటాష్, 10:26, ఎరువుల నిల్వల రికార్డులను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏడీఏ బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ రూరల్ మండలంలో యూరియా కొరత లేదన్నారు. సీజన్ చివరి వరకు ఎరువులను సరఫరా చేస్తామన్నారు.

చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఇంటర్నేషనల్ ఓపెన్, బ్లిట్జ్‌ఫైడ్ రేటింగ్ టోర్నమెంట్‌లో సింగ్‌నగర్ రామకృష్ణ చెస్ అకాడమీకి చెందిన విద్యార్థి షణ్ముకేశ్వర సాయిరాజ్‌వర్మ ప్రతిభ కనబర్చాడు. రెండు టోర్నమెంట్లలో జరిగిన ఓపెన్ కేటగిరిలో అంతర్జాతీయ ఫిడే రేటింగ్(1493)ను, బ్లిట్జ్ టోర్నమెంట్‌లో (1540) రేటింగ్ సాధించాడు. దీంతో సింగ్‌నగర్‌లోని రామకృష్ణ చెస్ అకాడమీలో సాయిరాజ్ వర్మకు చెస్ కోచ్ అవ్వారు రామకృష్ణ పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. షణ్ముకేశ్వర సాయిరాజ్ వర్మ మరింత ప్రతిభ కనబర్చి నగరానికి రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి

మైలవరం: కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి అప్పారావు తెలిపారు. మైలవరంలోని యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించి భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 15న విజయవాడలోని రాష్ట్ర లేబర్ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ 'సెంట్రల్' అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని పలు డివిజన్లకు అనుబంధ విభాగ అధ్యక్షులను నియమించారు.

1వ డివిజన్: యూత్ వింగ్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, మహిళా విభాగం గోరి అనురాధ, బీసీ సెల్ వనపల్లి నూకరాజు, ఎస్సీ సెల్ బుడిగపోగు వెంకటేష్, మైనార్టీ సెల్ షేక్ సూఫీబాబాను నియమించారు.

24వ డివిజన్: యూత్ వింగ్ అధ్యక్షుడిగా చొప్పవరపు మహేంద్ర, మహిళా విభాగం గజ్జి నాగమణి, బీసీ సెల్ కాజా శంకర్, ఎస్సీ సెల్ తాళ్ల చందు నియమితులయ్యారు.

25వ డివిజన్: యూత్ వింగ్ బత్తుల నాగరాయణ, మహిళా విభాగం తలాటి లీల కృష్ణ, బీసీ సెల్ చోడిబోయిన లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ నామవరపు దుర్గారావు, మైనార్టీ సెల్ ఎండీ ఇబ్రహీం

26వ డివిజన్: యూత్‌వింగ్ సోముల సోమాజీ, మహిళా విభాగానికి పసుపులేటి దుర్గాభవాని, బీసీ సెల్ ఆవులదొడ్డి వెంకట దుర్గారావు, ఎస్టీ సెల్ పారా ప్రసాద్,



మైనార్టీ సెల్ ఎస్కే రఫీ

27వ డివిజన్: యూత్ వింగ్ కొండ ఏసుపద్మ, మహిళా విభాగం నటావా వరలక్ష్మి, బీసీ సెల్ లింగాల వెంకన్నబాబు, ఎస్సీ సెల్ విల్సన్ రాజు, మైనార్టీ సెల్ షేక్ మదీనా

29వ డివిజన్: యూత్ వింగ్ బి.పూర్ణ, మహిళా విభాగం జయలక్ష్మి, బీసీ సెల్ సముద్రపు గోవింద్, ఎస్సీ సెల్ జాక్సన్ రాజు, మైనార్టీ సెల్‌కు చాన్ బాషా

30వ డివిజన్: యూత్ వింగ్ ఉదయ్‌కుమార్, మహిళా విభాగం పార్వతి, బీసీ సెల్ ఎస్ రామకృష్ణ, ఎస్సీ సెల్ వల్లవాసి ధనుంజయరావు, మైనార్టీ సెల్‌కు ఎస్కే బాషా

31వ డివిజన్: యూత్ వింగ్ వోగురు గణేష్, మహిళా విభాగం జింకల మల్లీశ్వరి, బీసీ సెల్ కె.వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ ములకలపల్లి కిరణ్‌కుమార్, మైనార్టీ సెల్ ఎస్కే రబ్బాని నియమితులయ్యారు.

32వ డివిజన్: యూత్ వింగ్ గద్దె రవి కుమార్, మహిళా విభాగం సీహెచ్ సుజాత, బీసీ సెల్ బాడిశ గణేష్, ఎస్సీ సెల్ పరాసు ఎలిషా, మైనార్టీ సెల్ ఎస్కే ఎండీ అబ్దుల్ హక్

33వ డివిజన్: యూత్ వింగ్ ఫణి కనగర్ల, మహిళా విభాగం కె.సత్యవాణి, బీసీ సెల్ రాధాకృష్ణ వంగర

36వ డివిజన్: యూత్ వింగ్ కంటుమజ్జి సోమేష్, మహిళా విభాగం మణికంఠ స్వామి కల్పన సునీత, బీసీ సెల్ డోల రాంబాబు, మైనార్టీ సెల్ షేక్ మస్తాన్

57వ డివిజన్: యూత్ వింగ్ బలసాని జగదీష్, మహిళా విభాగం డన్నే భాగ్యలక్ష్మి, బీసీ సెల్ కుండ్ల కనకరావు, ఎస్సీ సెల్ పగిడిపోగు ప్రసాద్, మైనార్టీ సెల్ షేక్ ఇస్మాయిల్

58వ డివిజన్: యూత్ వింగ్ జూలూరి శ్యామ్ కుమార్, మహిళా విభాగం ఎం.శ్రీలక్ష్మి, బీసీ సెల్ తమ్మిశెట్టి దుర్గామల్లేశ్వరరావు, ఎస్సీ సెల్ చిన్నం స్వరూపారాణి, మైనార్టీ సెల్ ఎండీ అబ్దుల్ జలీల్ ఖాన్

59వ డివిజన్: యూత్ వింగ్ తమ్మిశెట్టి రాజు, మహిళా విభాగం కొండ జయలక్ష్మి, బీసీ సెల్ బండారు దుర్గారావు, ఎస్సీ సెల్ మార్పుల్ నాగేశ్వరరావు, మైనార్టీ సెల్ జిలానీ

60వ డివిజన్: యూత్ వింగ్ పఠాన్ పీర్ బాబు, మహిళా విభాగం షేక్ ఫాతిమా, బీసీ సెల్ కోడూరు గోపి, ఎస్సీ సెల్ చిన్న అర్జున్, మైనార్టీ సెల్ షేక్ సగ్రహ ఆలీ

61వ డివిజన్: యూత్ వింగ్ పామర్తి హరిసాయి, మహిళా విభాగం బేతపూడి కళ్యాణి, బీసీ సెల్ వెన్నుకోట వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ బత్తుల మధు, మైనార్టీ సెల్ షేక్ నబీ

62వ డివిజన్: యూత్ వింగ్ కాయల జశ్వంత్, మహిళా విభాగం వనపల్లి శివ పార్వతి, బీసీ సెల్ కాటేపల్లి నారాయణ, ఎస్సీ సెల్ మిట్ట నాగార్జున, మైనార్టీ సెల్ రియాజ్ షేక్

63వ డివిజన్: యూత్ వింగ్ సాయి మణికంఠ, మహిళా విభాగం మగాని రాజేశ్వరి, బీసీ సెల్ రేపాన ఏసు, ఎస్సీ సెల్ మేడంకి నాగేశ్వరరావు, మైనార్టీ సెల్ షేక్ ఆలీ

64వ డివిజన్: యూత్ వింగ్ మహేశ్వర లక్ష్మణరావు, మహిళా విభాగం రావి విమల, బీసీ సెల్ తాండవకోటి చైతన్య, ఎస్సీ సెల్ కంభంపాటి మోజెస్, మైనార్టీ సెల్ షేక్ బాజీ నియమితులయ్యారు.

వర్షం నీరు నిలవకుండా శాశ్వత ప్రణాళికలు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



బెంజిసర్కిల్ వద్ద వర్షంనీటి నిల్వలో సమస్యలను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడ తూర్పు): వర్షం నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చెయ్యాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆయన సోమవారం ఎంజీరోడ్డు, ఈట్ స్ట్రీట్, బెంజిసర్కిల్, పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్, గుణదల ఈఎస్ఐ హాస్పిటల్ రోడ్, మాచవరం ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ గుణదల ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద పుల్లేటి కాలువ ప్రవహించే దారిలో ఉన్న అడ్డంకులను తొలగించారని, నగరంలో రోడ్లపై వర్షం నీటి నిల్వ ఉన్న ప్రాంతాలకు ఇటువంటి శాశ్వత పరిష్కారాలకు ప్రణాళికను సిద్ధం చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రధానంగా వన్‌టౌన్ లోబ్రిడ్జ్ వద్ద వాన నీరు నిల్వ ఉండటానికి కారణాలను వివరిస్తూ పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈట్ స్ట్రీట్ వద్ద వాన నీరు నిలిచిపోవడంపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను అడిగి ఆయనపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మాన్సూన్ రెస్పాన్స్ టీం అప్రమత్తంగా ఉండాలన్నారు. కృష్ణలంక బసవతారక నగర్ వద్ద నీళ్లు నిల్వ ఉన్నాయని సమాచారం అందిందని, అక్కడ నీరు నిల్వ ఉండటానికి గల కారణాలేంటి పంపింగ్ మోటర్లు ఎందుకు పంప్ చేయడం లేదని అధికారులను నిలదీశారు. పది మోటర్లలో 9 మోటార్లు పంప్ చేస్తున్నాయని, ఒక మోటార్ మాత్రమే మరమ్మతులో ఉందని అధికారులు వివరణ ఇచ్చినా కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉపాధి అవకాశాలు అపారం



మాట్లాడుతున్న ఎం.విజయసారథి



హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

పేరెంట్స్ మీట్‌లో ప్రిన్సిపాల్ విజయసారథి

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): పాలిటెక్నిక్ చేసిన విద్యార్థులకు అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి చెప్పారు. స్థానిక రమేష్ ఆస్పత్రి రోడ్డు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సెమినార్ హాలులో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ మొదటి సంవత్సరం విద్యార్థుల పేరెంట్స్ మీట్ సోమవారం జరిగింది. విజయసారథి మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాపకులు ఉన్నారని చెప్పారు. పాలిటెక్నిక్ కోర్సు పూర్తయ్యే సమయానికి ఉద్యోగాలు కల్పించడానికి కంపెనీలు సిద్ధంగా ఉంటాయన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుంటూ వారిలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అప్పుడే ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని చెప్పారు. టీవీఎల్ ఎలక్ట్రికల్స్ అధినేత టి.రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతులు కె.బాబూరావు, డాక్టర్ బి.శైలజ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతకు నైపుణ్యాలు చాలా కీలకమని చెప్పారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఎస్‌టీపీఐ టెక్నికల్ ఆఫీసర్ ఎన్.శ్రీవైష్ణవితో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెరుగుతున్న పిచ్చి మొక్కలతో కలవరం



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ ఎనిమిదో రోడ్డులోని ట్రెండ్‌సెట్ మెడోస్‌లో రోజురోజుకు పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయి. పిచ్చి మొక్కలను పట్టించుకున్నవారు కరువవ్వడంతో సర్పాల సంచారం అధికమైందని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల 189, 205 ప్లాట్ వద్ద ఆరు అడుగుల పాము కనిపించటంతో ఆ ప్రాంత వాసులు బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న పిచ్చి మొక్కల్లో సర్పాలు ఉంటున్నాయి. దోమలు పెరుగుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు, ట్రెండ్‌సెట్ మెడోస్ నిర్వాహకులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

గణనాథుడి ఆశీస్సులు అందరికీ లభించాలి



ఎస్ఎన్‌పురం లక్ష్మీగణపతి మందిరంలో ప్రత్యేక అలంకారంలో వినాయకుడు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గణనాథుడి ఆశీస్సులు ప్రతిఒక్కరికీ లభించాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. మధురానగర్ వీవీనరసరాజు రోడ్డు వినాయక మందిరం వినాయక చవితి వేడుకల్లో సోమవారం ఆయన పూజలు చేశారు. మందిర వ్యవస్థాపకుడు గద్దం మేస్త్రి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీలక్ష్మిగణపతి మందిరంలో..

28వ డివిజన్ సత్యనారాయణపురం మారుతీ వ్యాయామశాల సమీపంలోని శ్రీ లక్ష్మీగణపతి మందిరంలో వినాయక చవితి మహోత్సవాలలోభాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాబూరావు మేడ సెంటర్‌లో..

సత్యనారాయణపురం బాబూరావు మేడసెంటర్‌లో గుడిపాటి దత్తు ఆధ్వర్యాన వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రికలో లక్ష్మీగణేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కేశినేని వెంకట్ చౌదరి, కె.రవికుమార్, వరలక్ష్మి దంపతులు భక్తులు పాల్గొన్నారు. 64వ డివిజన్ జగజ్జీవన్ రామ్ కాలనీలో వినాయకు ని భక్తులు పూజలు చేసి ఆశీస్సులు స్వీకరించారు. 63వ డివిజన్ రాజీవ్‌నగర్లో మెగా ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు స్వామి వారికి విశేష పూజలు జరిగాయి.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర వాసులకు వీఎంసీ అందిస్తున్న మౌలిక వసతుల్లో సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే వాటిని పరిష్కరించేందుకు ఆయా విభాగాల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఆయన సోమవారం ప్రజా ఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 9 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళికపై 2, ఇంజినీరింగ్-5, ప్రజారోగ్య విభాగం-1, ఎస్టేట్‌పై -1 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) చంద్రశేఖర్

5, 6 తేదీల్లో ప్రవక్త కేశం ప్రదర్శన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని జుమ్మా మసీదు ప్రాంగణంలో ఈ నెల ఐదు, ఆరు తేదీల్లో హజరత్ మహ్మద్ వారి కేశం ప్రదర్శనకు ఉంచుతామని ఆ సంస్థ మేనేజర్ షేక్ నూర్ తెలిపారు. ప్రవక్త జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా ఆ ప్రత్యేక గదిని తెరచి మహ్మద్ ప్రవక్త కేశం ప్రదర్శన చేస్తామన్నారు. అదే క్రమంలో ఈ ఏడాది సైతం ప్రదర్శన ఉంటుందన్నారు. ఐదో తేదీన ముస్లిం పురుషులను, ఆరో తేదీన ముస్లిం మహిళలను ప్రదర్శనకు అనుమతిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాల్లో మసీదు ప్రముఖులు అబ్దుల్ ముస్తఫా రిజ్వీ ఖాతీబ్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.